క్లుప్తంగా

19వ పాశురం


బలిజిపేట రామాలయంలో దీపారాధన

బలిజిపేట: ధనుర్మాసం సందర్భంగా బలిజిపేట రామాలయంలో 19వ పాశురం కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు 108 దీపాలు వెలిగించారు. ధనుర్మాసంలో కార్యక్రమాలు చేసే వాటిలో దీప పాశురం విశేషమని, దీన్ని ఎంతో గొప్పగా జరుపుకుంటారని అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలిపారు. స్వామివారిని పూలతో అలంకరించి, ధూప,దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

35మంది నిరుపేదలకు వితరణ


నిరుపేదలకు వితరణ అందిస్తున్న దాత

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో 35మంది నిరుపేదలకు గ్రామానికి చెందిన టీపీఆర్ పట్నాయక్ వస్త్రదానం, అన్నదానం గురువారం నిర్వహించారు. నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు ఆధ్వర్యంలో గ్రంథాలయంవద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. నిరుపేదలకు ఇలా వితరణ అందించేవారిని భగవంతుడు ఎల్లవేళలా కాపాడుతాడని సంజీవనాయుడు ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో జి.సత్యం, కళావతి, దయానంద్, జి.సాధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

● ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్


ఓటర్లతో ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని ఐటీడీఏ పీఓ, ఈఆర్ఓ విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన సాలూరు పట్టణంలోని సత్యసాయికళాశాల వద్ద నిర్వహించిన అంతర్జాతీయ వృద్ధ ఓటర్ల దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటు చాలా గొప్పదని చెప్పారు. ఓటు ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు. వీవీప్యాట్‌లో ఓటుఎలా వేయాలో వివరించారు.ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పలువురు వృద్ధ, దివ్యాంగ, ట్రాన్స్‌జెండర్ ఓటర్లను కార్యక్రమంలో సన్మానించారు. తహసీల్దార్ బాలమురళీకృష్ణ, ఎలక్షన్ డీటీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ


డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

సీతంపేట: స్థానిక ఐటీడీఏ సమీపంలో రోడ్డు డివైడర్‌ను ఓ లారీ గురువారం ఢీకొట్టింది. కొత్తూరు నుంచి సీతంపేట వస్తుండగా, అదుపుతప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

12 మద్యంసీసాల స్వాధీనం

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురం గ్రామంలో చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా విక్రయిస్తున్న 12 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన వారణాసి జగన్మోహనరావు దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతున్నట్లు విషయం తెలిసి, ఆకస్మిక తనిఖీలు చేసి, మద్యంబాటిళ్లను పట్టుకున్నామన్నారు. ఇదే ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయించినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీవన ప్రమాణాలు పెరిగేందుకే

సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే జోగారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు


సీఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

బలిజిపేట: నిరుపేద, సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకే సంక్షేమ పథకాల అమలును సీఎం జగన్మోహన్ రెడ్డి పక్కాగా చేపడుతున్నారని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు కొత్త పింఛన్లు, పెరిగిన పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే జోగారావు బలిజిపేటలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు ఆత్మవిశ్వాసం, ఆత్మ గౌరవంతో జీవిస్తున్నారన్నారు. వారిలో మనోధైర్యం పెరిగిందన్నారు. అందుకు వారికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక భరోసానే కారణమని చెప్పారు. ప్రజా సంకల్పయాత్రలో, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేసింది ఒక్క సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమేనన్నారు. జీవితం భారం కాకుండా ఉండేందుకు ప్రతి అక్కకు, చెల్లెమ్మకు, రైతులకు, వివిధ వర్గాలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఏకైక సీఎం జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. నాడు–నేడుతో పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మారాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలో చదువుకునేందుకు తరగతి గదులు కరువయ్యాయి, కూర్చునేందుకు బెంచీలు లేవు, మౌలిక సదుపాయాలు లేవు, మంచి పౌష్టికాహారం లేదని ఇప్పటి ప్రభుత్వంలో పాఠశాలలు కళకళలాడుతున్నాయన్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన, జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారం అందుతోందన్నారు. తల్లి ఖాతాలోకి అమ్మ ఒడి పథకం ద్వారా డబ్బులు జమ అవుతున్నాయన్నారు.

కంటికి రెప్పలా కాపాడే ప్రభుత్వం

గత ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసం చేస్తే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వారిని అన్ని విధాలా ఆదుకున్న ప్రభుత్వం ఇదేనని చెప్పారు. రాష్ట్రంలో అన్ని వర్గాలవారిని కంటికి రెప్పలా కాపాడుకునే ప్రభుత్వం ఇదన్నారు. ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేస్తే సంక్షేమం తెచ్చుకున్నట్లేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘలత, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఎం ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండలశాఖ మహిళా సంఘం అధ్యక్షురాలు దుర్గేశ్వరి, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పింఛనే ఆధారం



గతం కంటే ఇప్పుడు పింఛన్ పెరిగింది. దీనిపై ఆధారపడి బతుకుతున్నాను. జగన్ రుణం తీర్చుకోలేం. జగన్ మళ్లీ రావాలి.

– పి.సీతమ్మ, నారాయణపురం, బలిజిపేట మండలం

నాకు ఇదే ఆధారం



నాకు భర్తలేదు. ఎటువంటి ఆధారం లేదు. నాకు ఇప్పుడు వచ్చే పింఛనే ఆదారం. ఇప్పుడు పింఛన్ కొత్తగా వచ్చింది. వలంటీర్ ద్వారా దరఖాస్తు చేయగానే పింఛన్ వచ్చింది. ఎంతో సంతోషంగా ఉంది.

– పి.సీత, బలిజిపేట

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

● ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని తన స్వగృహంలో వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు.శాఖల వారీగా పనుల ప్రగతిపై ఆరా తీశారు. మంజూరైన పనుల్లో పూర్తయినవి, పూర్తికావస్తున్నవి, ప్రారంభించాల్సిన వాటిపై చర్చించారు. పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు చేసి ప్రజలకు అంకితం చేసేందుకు ఏర్పాట్లుచేయాలని, పూర్తికావచ్చిన పనులు వేగవంతం చేసి పూర్తిచేయించాలని, నూతనంగా మంజూరైన పనులకు శంకుస్థాపనలు చేసేందుకు ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. పీవీటీజీ కింద స్కూళ్లు,అంగన్వాడీ భవనాలు, తాగునీరు, రోడ్లు లేని గ్రామాలను గుర్తించి తక్షణమే ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న పీఆర్ ఎస్ఈ కృష్ణాజీ మాట్లాడుతూ, ఇప్పటివరకు 9 రోడ్లు, 5 వంతెనలు,8 ప్రాధాన్యతాభవనాల పనులు పూర్తయి ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు. సాంపిగాం,ఆలూరు వంతెనలు నూతనంగా మంజూరయ్యాయని, వాటికి శంకుస్థాపన చేయాల్సి ఉందన్నారు. గడపగడపకు మనప్రభుత్వం నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి ఆన్‌లైన్ చేసిన బిల్లులు చెల్లింపులు జరిగాయన్నారు. ఐటీడీఏ పీడీ మణిరాజ్ మాట్లాడుతూ,సాలూరు మండలంలోని నార్లవలస పంచాయతీలో పెద్దవలస నుంచి మూలవలస వరకు సుమారు కోటి రుపాయలతో నిర్మించిన బీటీ రోడ్డు, దుక్కడవలస నుంచి మిర్తివలస వరకు 2.5 కి.మి మేర సుమారు రూ.కోటిన్నరతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యాయని, మరిన్ని పనులు వివిధ దశలలో ఉన్నాయని వివరించారు. పాచిపెంట మండలంలో ఆలూరు, మోదుగ రోడ్లు పూడి, జీలికివలస రోడ్లు వద్ద విద్యుత్‌లైన్‌లు కిందికి వేలాడుతుండడంతో అక్కడ రోడ్డు పనులు జరగడానికి ఇబ్బందిగా మారిందని, కావున వాటిని సరిచేయాలని ఎలక్ట్రికల్ ఎ.డి రంగారావును ఉపముఖ్యమంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

వచ్చిన వారే వెళ్లారు


మాట్లాడుతున్న ఎంపీపీ రమణమ్మ, జెడ్పీటీసీ బాబ్జీ

సీతానగరం: మండలంలో మూడు రోజులుగా జరుగుతున్న రాజకీయ సమీకరణాల కారణంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి జరిగే నష్టమేమీ లేదని సీతానగరం ఎంపీపీ బి.రమణమ్మ, జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు అధ్యక్షతన పార్టీ సీనియర్ నాయకులు సర్పంచ్‌లతో అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో వారు మాట్లాడుతూ దయానిధిపురం, బక్కుపేట, పెదంకలాం, చినంకలాం గ్రామాల సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరినట్లు ప్రకటించడంపై మాట్లాడుతూ గతంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన వారంతా సొంతగూటికి వెళ్లారన్నారు. గాదెలవలస, బూర్జ గ్రామాలకు చెందిన వారు టీడీపీ వారేనని, వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరుతున్నారని ప్రకటించడం అర్థరహితమన్నారు. వారంతా సొంతగూటికి వెళ్లిపోవడంతో పార్టీకి నష్టమేమీలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు వై.రాధాకృష్ణ, బి.సూర్యనారాయణ, అప్పారావు, మాజీ ఎంపీపీ కె.రత్నాకర్, పి.ఈశ్వరనారాయణ, గాదెలవలస సర్పంచ్ బి.అన్నపూర్ణమ్మ, బి తిరుపతిరావు, గెడ్డలుప్పి సర్పంచ్ తిరుపతిరావు, చినంకలాం మాజీ సర్పంచ్ నరహరినాయుడు, బి.తిరుపతిరావు, ఆర్వీ పార్థసారథి, శ్రీరాముడు, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో డిజిటల్ విప్లవం

● ఎమ్మెల్యే జోగారావు


ట్యాబ్‌లను విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో విద్యావ్యవస్థలో డిజిటల్ విప్లవం వచ్చిందని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని చిలకలపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, ఐఎఫ్‌పీ ప్యానల్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. అందులో భాగంగానే విద్యార్థులకు ట్యాబ్‌లు, తరగతి గదిలో ఐఎఫ్‌పీ ప్యానల్స్ వచ్చాయన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలలను ఊహకు అందని విధంగా తీర్చిదిద్దారని చెప్పారు. మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, బ్యాగ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూస్ పంపిణీ చేస్తున్నారన్నారు. పిల్లలను పాఠశాలలకు పంపితే తల్లుల ఖాతాలో అమ్మ ఒడి పథకం కింద నగదు జమ చేస్తున్నారని చెప్పారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసి వారికి డిజిటల్ బోధనపై అవగాహన కలిగేలా మార్పులు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకరరావు, సర్పంచ్ సుందరరావు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎంఈఓ సామల సింహాచలం, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ


భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున కొలువైన లక్ష్మీనృసింహ స్వామి భక్తులకు గురువారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో తులసీదళాలు, వివిధరకాల పూలతో స్వామిని అలంకరించారు. ఈ మేరకు ఆలయానికి చుట్టు పక్కలున్న నాలుగు మండలాల గ్రామ, పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు పూజాసామగ్రితో వివిధ రకాలవాహనాలతో తరలి వచ్చి క్యూలో లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని ముడుపులుచెల్లించారు. భక్తులకు పూజలనంతరం తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన తెలుగు యువత అధ్యక్షుడు


వైఎస్సార్‌సీపీలో చేరిన తెలుగు యువత అధ్యక్షుడు చందక దేశాలు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పురపాలక సంఘం పరిధి కొత్తవలస ప్రాంతం 5వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు, టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు చందక దేశాలు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కండువా వేసుకుని గురువారం పార్టీలో చేరారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలనకు మెచ్చి పార్టీలోకి చేరినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన ఆయనకు సముచిత స్థానం, తగిన గుర్తింపు ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకునేందుకు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు భీమవరపు కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.రమణ, షఫీ తదితరులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత


బీమా నగదును అందజేస్తున్న రంగునాయుడు

మక్కువ: స్థానిక మండల వీధికి చెందిన సివిరెల సంతోష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని తల్లి కళావతికి తక్షణ బీమా పరిహారం పదివేల రూపాయలను వైఎస్సార్ సీపీ మండల ప్రెసిడెంట్ మావుడి రంగునాయుడు గురువారం అందజేశారు. అలాగే డబ్బారువలస గ్రామానికి చెందిన కిలారి శాంతం నాయుడు మృతి చెందడంతో, మృతుని తల్లి గౌరీశ్వరికి పదివేల రూపాయలను బీమా తక్షణ పరిహారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కషిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఈవో రమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ శివ, సచివాలయ కన్వీనర్ కొత్తూరు శంకరరావు పాల్గొన్నారు.

బాధితులకు డిప్యూటీ సీఎం పరామర్శ


రెయ్యి గంగమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: మండలంలోని కొత్తవలస మాజీ సర్పంచ్ రెయ్యి గంగమ్మ భర్త లచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించిన నేపథ్యంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర గురువారం గంగమ్మ గృహానికి వెళ్లి పరామర్శించి ఓదార్చారు. అధైర్యపడవద్దని, ఏ కష్టం వచ్చినా తమకు తెలపాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పట్టణంలోని దండిగాం రోడ్డులో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్ మావయ్య మత్రి విశ్వేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో బాధపడి చికిత్స తీసుకున్న నేపథ్యంలో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే అనారోగ్యంతో బాధపడి చికిత్స పొంది ఇంటికి వచ్చిన పట్టణంలోని 25వ వార్డుకు చెందిన తేగాల బలరాం ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఉపముఖ్యమంత్రి వెంట వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొన్నాడ సీతారాం, నెమలిపిట్ట కల్యాణ్, సంగంరెడ్డి జయసింహ తదితరులు ఉన్నారు.

వృద్ధులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి


ఓటుహక్కు వినియోగంపై ఫింగర్ చూపుతున్న సీనియర్ సిటిజన్స్

సీతానగరం: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వృద్ధులు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ కె.హేమలత అన్నారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ (మీ ఓటు–మీ భవిష్యత్) సిటిజన్‌లతో ఓటుహక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటు హక్కు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని, ఎన్నికల్లో సీనియర్ ఓటర్లంతా తమ ఓటుహక్కును వినియోగించుకుని రాజ్యాంగ స్ఫూర్తినివ్వాలని కోరారు. ఓటుహక్కు పొందడం, సీనియర్ సిటిజన్స్ ఓటు వినియోగం, దివ్యాంగులు ఓటు వేయడానికి అవసరమైన వనరులు కల్పించడంపై అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్ ఎన్వీ రమణతో కలిసి ఓటుహక్కు వినియోగంపై సీనియర్ సిటిజన్స్‌తో కలిసి రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఓ, వీఆర్ఏలతో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ కార్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆర్డీఓ పరిశీలించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ పి.చిట్టెమ్మ, వీఆర్వోలు,వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల పరిశీలన

సీతానగరం మండలంలో రైల్వేశాఖ నిర్మిస్తున్న థర్డ్ లైన్‌లో ఇళ్లస్థలాలు గల ప్రజలకు ప్రభుత్వం నిర్దేశించిన ధర చెల్లిస్తామని ఆర్డీఓ కె.హేమలత అన్నారు. ఈ మేరకు గురువారం థర్డ్‌లైన్‌లో చినభోగిలి వద్ద రేకులషెడ్ స్థలంతో పాటు, ఖాళీస్థలాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలాలు కోల్పోయిన కుటుంబాలతో మాట్లాడుతూ రైల్వే థర్డ్ లైన్ నిర్మాణం కోసం భూములు, స్థలాలు కోల్పోయిన వాటిని పరిశీలించి నష్టపరిహారం నిమిత్తం ప్రభుత్వానికి నివేదిక తయారుచేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్వీ రమణ, వీఆర్ఓలు పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్స్ ఓటుహక్కు ప్రాధాన్యం గుర్తించి అందరూ ఓటును వినియోగించుకోవాలని ఆర్డీఓ, ఈఆర్ఓ హేమలత తెలిపారు. ఎన్నికల సందర్భంగా బలిజిపేట తహసీల్దార్ కార్యాలయంలో వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లతో ఆమె గురువారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యం ఏర్పర్చుకోవాలి


విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న ఉపాధ్యాయుడు అనంతబాబు

సీతంపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఏర్పర్చుకుని, దాని సాధనకు కృషి చేయాలని చిన్నబగ్గ పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు డి.అనంతబాబు అన్నారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలికలు)లో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఉత్తమ భవిష్యత్‌కు ఎటువంటి లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటిని ఏ విధంగా చేరుకోవాలన్న అంశాలను క్షుణ్నంగా వివరించారు. వీటితో పాటు మంచి అలవాట్లు ఎలా నేర్చుకోవాలి, వాటిని ఎలా కొనసాగించాలి, కాలం నిర్వహణ, క్రమశిక్షణ, పెద్దలు, ఉపాధ్యాయుల పట్ల గౌరవ భావం వంటి విషయాలను తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి, హెచ్‌డబ్ల్యూవో పాలక అమల తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: గిరిజన గ్రామాల్లో సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి తెలిపారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వైద్య సిబ్బందితో సమావేశమైన ఆమె వ్యాధితో బాధపడుతున్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

పాలకొండ: స్థానిక పట్టణంలోని యాలాం జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అటువైపుగా వచ్చే వాహనాలను ఆపి, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు, లైసెన్స్‌లు పరిశీలించారు. ఆయా ధ్రువపత్రాలు లేని వారికి అపరాద రుసుం విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, పండగ నేపథ్యంలో సురక్షిత ప్రయాణాలు చేయాలని వాహనదారులకు తెలిపారు.